క్లుప్తంగా

ముగిసిన సప్తాహం



పూజలు చేస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడలో ఏడు రోజులుగా కొనసాగుతున్న గురు పారాయణ సప్తాహ కార్యక్రమం గురువారం ముగిసింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తి మార్గమే అందరికీ ముక్తిని ప్రసాదించే మార్గమన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తి మార్గంలో పయణించాలన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ తుల సీరాం, సర్పంచ్ ఆత్రం యాదవ్‌రావ్, బీజేపీ నాయకులు సునంద, జ్యోతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు రాహుల్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులకు మండల వైద్యాధికారి రాహుల్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, బ్లడ్ యూరిన్, తదితర పరీక్షలు చేసిన మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నెల నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషన్ మడావి శ్రీనివాస్, వసంత, మర్సుకోల లక్ష్మీ, ఈశ్వరీ దేవి, వేణుతాయి, ఫార్మసిస్టు ఆలం, ఈశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత

ఆదిలాబాద్‌రూరల్: చింతల మనస్విత తండ్రి పురుషోత్తంకు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి చేతుల మీదుగా గురువారం ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనస్వితకు ఇటీవల మద్రాస్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీట్ రావడం జరిగిందన్నారు. అందులో భాగంగానే విద్యార్థి తండ్రికి ల్యాప్‌టాప్ అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లూరి భూమన్న, ప్రధాన కార్యదర్శి బాబాన్న, దేవిదాస్, శ్రీనివాస్, శశికాంత్, ప్రశాంత్, ప్రకాశ్, రమేశ్, సూరం భూమన్న, సుదర్శన్ పాల్గొన్నారు.

'కేసును పక్కదోవ పట్టించొద్దు'



మాట్లాడుతున్న ఊషన్న, నాయకులు

బోథ్: మండలంలోని కౌఠ గ్రామంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన దీటి రాజుకు సంబంధించిన కేసును పోలీసులు పక్కదోవ పట్టించొద్దని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడాల స్వామి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కౌఠ గ్రామస్తుడు ఊషన్నకు చెందిన ఎద్దులను రాజు దొంగిలించాడని పోలీసులు పేర్కొనడం కేసును తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. ఎద్దులను దొంగిలించినందుకే రాజు ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు విచారణ చేయడం సరికాదన్నారు. ఊషన్న తన ఎద్దులు దొంగలించబడలేదని ఎస్సై రవీందర్‌కు గురువారం రాత పూర్వకంగా అందజేశారు. ఎద్దులు ఇంటి వద్దనే ఉన్నాయన్నారు. రాజు ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. కేసు విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఎస్సై తెలిపాడు.

కోర్టు భవన నిర్మాణం చేపట్టాలి

బోథ్: బోథ్ మండల కేంద్రంలో కోర్టు భవన నిర్మాణాన్ని చేపట్టాలని ఆర్‌అండ్ బీ రాష్ట్ర అధికారిణి వరమ్మాను బోథ్ బార్ అసోసియేషన్ కార్యదర్శి పంద్రం శంకర్ గురువారం కలిసి విన్నవించారు. ఆమె సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. పట్నాపూర్ సర్పంచ్ పంద్రం సుగుణ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

ఖానాపూర్: ప్రభుత్వం వెంటనే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూతన్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి అన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు యార్డులో పోసిన ధాన్యం కుప్పలు పరిశీలించారు. బొమ్మెన సురేశ్, నాగెల్లి నర్సయ్య, రామిడి నర్సయ్య, ఆకుల రాజేశ్వర్ పాల్గొన్నారు.

అన్నీ ఆన్‌లైన్‌లోనే..

- ఓఎల్‌ఎంఎస్ విధానంలోనే విత్తనాలు కొనడం, అమ్మడం
- డీలర్లకు అవగాహన కల్పించిన వ్యవసాయాధికారులు

గతంలో బోథ్ మండలంలోని ఓ రైతు డీలర్ వద్ద పత్తి విత్తనాలను కొన్నాడు. విత్తనాలు విత్తిన తరువాత మొలకలు వచ్చాయి. కానీ పూత రాకపోవడంతో రైతు ఆందోళన చెందాడు. డీలర్‌తో గొడవ పెట్టుకున్నాడు. కాగా తాను ఉచితంగా వేరే విత్తనాలు అందిస్తానని, గొడవ చేయవద్దని చెప్పడంతో ఆ రైతు ఫిర్యాదు చేయకుండా వెనుదిరిగాడు.



విత్తనాలను కొంటున్న రైతులు (ఫైల్)

బోథ్: నకిలీల బారి నుంచి రైతులను కాపాడడం కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓఎల్‌ఎంఎస్) విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఏటా నకిలీ విత్తనాలను పట్టుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తోంది. వ్యవసాయ శాఖలో క్షేత్రస్థాయిలో కొందరి సహకారంతో దళారులు దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. ప్రతీ డీలరు ఏ విత్తనాలు విక్రయిస్తున్నారు? వాటిని ఎక్కడ కొన్నారు? వాటి అనుమతులు? ఎవరికి విక్రయించారు అనే పూర్తి వివరాలు ఇందులో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈక్రమంలో నకిలీ కంపెనీలు, విక్రయదారులు ఎవరైనా ఉంటే ఉన్నతాధికారులకు సులువుగా తెలుస్తుంది. గతంలో జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల విక్రయాలపై పలు కేసులు నమోదయ్యాయి. ఏటా జిల్లాలో విత్తనాల వ్యాపారం కోట్లలో జరుగుతోంది. అందులో పది శాతం వరకు నకిలీ వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఈవిధానం ద్వారా నకిలీ విత్తనాలను విక్రయించడానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి.

వివరాలు..	
జిల్లాలోని రైతులు	1.48 లక్షలు
సాధారణ సాగు	5.61 లక్షల ఎకరాలు
డీలర్లు	355
అవసరమైన విత్తనాలు	26 వేల క్వింటాళ్లు

రైతులు రశీదు తీసుకోవాలి

ఓఎంఎల్ఎస్ విధానం అమలు చేస్తున్నాం. డీలర్లకు దీనిపై అవగాహన కూడా కల్పించాం. విత్తనాలు, ఎరువులు తీసుకునే రైతులు రశీదు తీసుకోవాలి. నష్టం వాటిల్లిన సమయంలో ఈవిధానం వల్ల రైతుకు ఉపయోగకరంగా ఉంటుంది. క్రయ, విక్రయాలు పారదర్శకంగా ఉంటాయి.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

పెరగనున్న జవాబుదారీతనం..

ఓఎల్‌ఎంఎస్ విధానంతో విక్రయాల్లో పారదర్శకత పెరగనుంది. కొత్త విధానం ప్రకారం రైతులకు అన్ని అనుమతులున్న విత్తనాలనే డీలర్లు విక్రయించాల్సి ఉంటుంది. పంట దిగుబడి తగ్గినా.. తెగుళ్లు సోకినా రైతులకు సదరు డీలరు జవాబుదారీ అవుతాడు. పంట నష్టం జరిగిన సమయంలో రైతుకు కొంత వరకైనా న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. గతంలో విక్రయ లైసెన్స్‌ల విషయంలో వ్యవసాయశాఖ అధికారులే చెప్పిందే వేదం అన్నట్లుగా ఉండేది. ఈ విధానం వల్ల లైసెన్స్‌ల జారీ, రెన్యూవల్ ప్రక్రియ కూడా పారదర్శకంగా ఉంటుంది.

అటెన్షన్ ప్లీజ్..

పొంచి ఉన్న ప్రమాదం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో విద్యుత్ స్తంభం ఒకవైపు వంగి ప్రమాదకరంగా మారింది. భారీ గాలులకు ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: మహేందర్‌రెడ్డి, ఏఈ, ఇచ్చోడ, ఫోన్: 94408 11699



అభివృద్ధిపై విమర్శలు చేయడం సరికాదు

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



చెక్కులు అందజేస్తున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధి గురించి విమర్శలు చేయడం సరికాదని మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే ఆదిలాబాద్ అభివృద్ధి చెందిందన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన రేవంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేశ్, ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, కోవ రవి, ఎనుగంటి ప్రకాష్, కుమ్ర రాజు, రాంకుమార్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు కేంద్రం పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ అభివృద్ధి కనిపించకపోతే రేవంత్‌రెడ్డి కంటివెలుగు శిబిరాల్లో కంటి పరీక్షలు చేయించుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ చురకలు అంటించారు. గురువారం పట్టణంలోని కైలాస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కళ్లద్దాలు, మందుల పంపిణీపై ఆరా తీశారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంకుమార్, అశోక్, గంగారెడ్డి, సురేందర్, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

'రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి'



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో నిర్వహించిన నిరుద్యోగ సమరభేరి కార్నర్ మీటింగ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పూలమాల వేయలేదని, వెంటనే క్షమాపణ చెప్పాలని అంబేడ్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ దుర్గం శేఖర్ డిమాండ్ చేశారు. గురువారం అంబేడ్కర్ విగ్రహాన్ని నీళ్లతో శుద్ధిచేసి, మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ర్యాలీలో గజమాలతో సత్కారించుకున్న రేవంత్ రెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పిడికెడు పూలు చల్ల లేదని మండిపడ్డారు. అంబేడ్కర్‌ను గౌరవించని రేవంత్ రెడ్డికి ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్వ నగేశ్, కాంబ్లే, నక్క రాందాస్, రాజేందర్‌శర్మ, సతీశ్, జనగం సంతోశ్, రాజారెడ్డి, శోభాబాయి, సలీం, ఫెరోజ్, సిడాం రాంకిషన్, పోచ్చన్న, గంగారాం, శంకరయ్య, శ్రీనివాస్, గణేష్, ఎర్రన్న, మహేందర్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: అంబేడ్కర్‌ను అవమానించిన రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల నాయకులు గురువారం మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దళిత జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కాంబ్లే ప్రజ్ఞశీల్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌కు వచ్చిన రేవంత్ రెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించకుండా గజమాలతో సన్మానించుకోవడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీపతి, దూట మహేందర్, భూమన్న, లక్ష్మణ్, దర్శనాల గంగరాజు, కేశవ్, కోల సత్తన్న, బింగి రాజన్న, రాజయ్య, స్వామి, దాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జైశ్రీరాం గోశాల నిర్వాహకుడు ఐద రాజేశ్వర్‌కు ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి గురువారం రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. రెండు రోజుల క్రితం ఈదురు గాలులతో వర్షం కురవడంతో గోశాల రేకుల షెడ్డు ఎగిరిపోయింది. దీంతో మరమ్మత్తుల కోసం నగదు అందజేసినట్లు తెలిపారు.

బోథ్: మండలంలోని గుర్రాలతండా గ్రామానికి చెందిన రాధిక అనే యువతి పెళ్లికి తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ రూ. 5వేలు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సకారాం, తులసినాయక్, మారుతి, రమేశ్, సుందర్, జగదీష్, రంజిత్, శ్రీకాంత్, ముత్యం, తూము సూర్యం, అరవింద్, ప్రశాంత్, మనోజ్, రవికాంత్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో గురువారం అంబేడ్కర్ జయంతిని బౌద్ధ ఉపాసకులు, ఉపాసికాలు, యువజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బుద్దిస్టు సంఘం పటేల్ గజానంద్, ఉప సర్పంచ్ లాను, కాంబ్లే బాపురావ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్లాట్లు కొనుగోలు చేయొద్దు

బోథ్: ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లే అవుట్‌లలో ఎవరూ ప్లాట్లు కొనుగోలు చేయవద్దని బోథ్ ఈవో అంజయ్య తెలిపారు. మండల కేంద్రంలో అక్రమంగా లేఅవుట్ ఉన్న స్థలాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. స్థలాలను కొనుగోలు చేస్తే ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వబడవని పేర్కొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర సదస్సులో జిల్లా ఉద్యోగులు

ఎదులాపురం: కేజీబీవీ, యూఆర్‌ఎస్ ఉపాధ్యాయులు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర సదస్సుకు జిల్లా ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులు సురేఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కేజీబీవీ, యూఆర్‌ఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు తరలివెళ్లారు. ఇందులో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అనురాధ, ఎస్‌వోలు ప్రశాంత్‌రెడ్డి, ప్రియాంక, కేజీబీవీ, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోను కలిసి నాయకులు

ఎదులాపురం: తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్– 1 (టీఆర్‌ఎస్‌కేవీ అనుబంధం) ఆదిలాబాద్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా సమస్యల గురించి చర్చించారు. అనంతరం డీఎంహెచ్‌వో నూతన కార్యవర్గాన్ని సన్మానించి అభినందనలు తెలిపారు. ఇందులో అధ్యక్ష, కార్యదర్శులు బండారి కృష్ణ, రఘురాం, కార్య నిర్వహక అధ్యక్షుడు రమణచారి, బ్రహ్మానందరెడ్డి, ప్రమోద్, రవీందర్ రాథోడ్, పుష్పలత, పద్మ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

ఇంద్రవెల్లి: మహిళలు, యువతులు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని హెల్ప్‌వీల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అతిష్‌కుమార్ కోరారు. గురువారం మండలంలోని పాటగూడలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ కుమ్ర రాజు, హెల్ప్‌వీల్ ఫౌండేషన్ సభ్యులు సంతోశ్, భాస్కర్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు, యువతులకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్, సర్వోదయ శ్రీనివాస్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు 45 రోజుల పాటు కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చారు. వీరికి సర్పంచ్ సదానంద్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్, ట్రైనర్ అపర్ణ రాణి, అనుపమ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



జొన్నపంట పరిశీలిస్తున్న వన్నెల అశోక్

తాంసి: వడగాళ్ల వానతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టీపీసీసీ సభ్యుడు వన్నెల అశోక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంతో పాటు జామిడి, కప్పర్ల గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్టపోయిన పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎకరానికి రూ.30వేల పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సంతోశ్, రాంరెడ్డి, స్వామి, వినోద్ రెడ్డి, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం: అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్‌సింగ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో మాట్లాడారు. మామిడి, వరి, నువ్వు, మొక్కజొన్న, పల్లీ, మినుము, జొన్న పంటలు వేసిన రైతులు నష్టపోయారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. వెంటనే నష్టం అంచనా వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమ్ర అశోక్, ఆత్రం గంభీర్, తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం: అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చేతికి వచ్చిన పంట నీటిపాలైందన్నారు.

సభను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్చోడ: ఎల్బీనగర్ క్రీడామైదానంలో ఈనెల 30న నిర్వహించే డీఎస్పీ పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని డీఎస్పీ నాయకులు కోరారు. గురువారం మండల కేంద్రంలో పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. స్వరాజ్యస్థాపన కోసం డీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారధన్ మహరాజ్ పదివేల కిలో మీటర్ల పాదయాత్ర పూర్తి చేసినట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీవర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ లక్ష్మణ్, భూమన్న, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు విశారధన్ చేపట్టిన పాదయాత్ర ఈనెల 30న ముగుస్తుందని దళిత శక్తి ప్రోగ్రాం నాయకులు తెలిపారు. గురువారం సభకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ముగింపు సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్, గణేశ్, రమేశ్, ప్రవీణ్, రఘువీర్, సాబీర్, గంగాధర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమ్మెకు నాయకుల మద్దతు



ఇచ్చోడ: మాట్లాడుతున్న మెస్రం జంగు

ఇచ్చోడ: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని బీఎస్పీ బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి మెస్రం జంగు కోరారు. గురువారం మండల కేంద్రంలో వీవోఏలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో హరినాథ్, యూసుఫ్, కిరణ్, వీవోఏలు పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న వీవోఏలకు అన్నదానం చేసి బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోశ్‌రెడ్డి, వీవోఏలు రమేశ్, దాసు, పుష్ప, రవి, బీజేపీ నాయకులు పోచ్చారెడ్డి, నర్సారెడ్డి, విలాస్, ప్రకాశ్ పాల్గొన్నారు.

జైనథ్: మండలంలోని ఐకేపీలో విధులు నిర్వహిస్తున్న వీవోఏలు గురువారం సమ్మె నోటీసులిచ్చారు. ఐకేపీ ఏపీఎం తుమ్మల వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రాఘవేంద్ర రావు, ఎస్సై పెర్సిస్ బిట్లకు నోటీసులు అందజేశారు. మండల అధ్యక్షుడు తలకొక్కుల రామన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. నాయకులు సంజీవ్, ఆశన్న, మోహన్, సంతోశ్, ప్రభాకర్, సురేశ్, మహేశ్, సునంద, నివర్త, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంటల సర్వే



వివరాలు సేకరిస్తున్న అధికారులు

తలమడుగు: మండలంలోని నందిగామ, పల్లి(కే), కొత్తూరు, బరంపూర్, ఖోడద్, గ్రామాల్లో వ్యవసాయాధికారులు వడగండ్ల వర్షానికి నష్టపోయిన పంటల సర్వేను చేపట్టారు. పంట, నష్టం అంచనా వివరాలు నమోదు చేస్తున్నారు. మండల వ్యవసాయాధికారి మహేందర్ సర్వేను పర్యవేక్షించారు. పకడ్బందీగా సర్వే చేపట్టాలని ఏఈవోలకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: రెండు రోజులుగా కురిసిన వడగళ్ల వానకు మండలంలోని పలు గ్రామాల్లో పంట నేలకొరిగాయి. గురువారం ఏఈవో సుధాకర్ ఉట్నూర్ క్లస్టర్ పరిధిలో పంట సర్వే నిర్వహించారు. అధికారులు స్పందించి నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఏఈఓ వెంట రైతులు కరిపే పోశన్న, ఎల్లయ్య, సాడిగే గంగాధర్, కరిపే లింగన్న, తదితరులు ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై సురేందర్

తలమడుగు: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్సై సురేందర్ అన్నారు. గురువారం మండలంలోని పల్సి(బి) గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మోటార్ వాహనాల చట్టం, మాదకద్రవ్యాలు సేవించడం వలన కలిగే అనార్థాలను తెలుసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సూర్యబాన్, బాపురావు, పోలీస్ సిబ్బంది ప్రహ్లద్, రామ్‌రెడ్డి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు,

'కేసులకు భయపడేది లేదు'



మాట్లాడుతున్న సభ్యులు

బోథ్: బోథ్‌లో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని బుధవారం శాంతియుతంగా ఆందోళన చేస్తే పోలీసులు కేసులు నమోదు చేయడాన్ని బోథ్ బచావో కమిటీ అధ్యక్షుడు పసుల చంటి ఖండించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. అస్తిత్వం, అభివృద్ధి కోసం, హక్కుల కోసం మాట్లాడితే అక్రమ కేసులు బనాయించడం ఏంటని ప్రశ్నించారు. పోలీసులను రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బోథ్ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి నిరంతరం కృషి చేస్తామని, ఆందోళన కార్యక్రమాల్లో ప్రజలే స్వచ్ఛందంగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మీర్ ఇర్షాద్ అలీ, జక్కుల వెంకటేశ్, సల్ల రవి, రహీమోద్దిన్, పోశెట్టి, అజార్‌ఖాన్ పాల్గొన్నారు.

కుర్చీల విరాళం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రంలో శిక్షణ పొందుతున్న చిన్నారుల సౌకర్యార్థం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ దాతలతో కలిసి 30 కుర్చీలను విరాళంగా గురువారం బాల కేంద్రం సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో దాతలు గణేశ్, రఘు, బాలకేంద్రం పర్యవేక్షకుడు రవి, బాలకేంద్రం తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు సాయినాథ్, సునీల్ దేశ్‌పాండే, చంద్రకళ దేవి, ప్రవీణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



ప్రశంసపత్రాలు అందజేస్తున్న సీడీపీవో వనజ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. సీడీపీవో వనజ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య అందించడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా చిన్నారులు వేసిన స్టెప్పులు అలరించాయి. అనంతరం సూపర్‌వైజర్ ఫర్హా, అంగన్‌వాడీ టీచర్ రాధతో కలిసి ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా, పిల్లల తల్లిదండ్రులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.